

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మంగళవారం జిల్లా పర్యటన సందర్భంగా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను



కలెక్టర్‌తో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

వివరించారు. వాటిపై కలెక్టర్ అంబేద్కర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా స్థాయి సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బొప్పరాజుతోపాటు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటరాజేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాడ్డి గోవింద, సూర్య, ఇతర నాయకులు ఉన్నారు.

అధికారులకు పి4 పాట్లు

మార్గదర్శుల కోసం వెతుకులాట ● వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజంలో అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చి బంగారు కుటుంబాలుగా మారుస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన పి4 ప్రాజెక్టు అమలులో అధికారులు పాట్లు పడుతున్నారు. పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు కానరాకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. విజయనగరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో 631మంది మార్గదర్శులను గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. పి4 కోసం వారిని ఒప్పించేందుకు అధికారులకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. 'మీరేం చేస్తారో తెలీదు, కచ్చితంగా మార్గదర్శులు (దాతలు) వెతికి, వారిని ఒప్పించాల్సిందేనని ఒత్తిడి చేయడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరో వైపు అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులను కూడా దత్తత తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో వారిలో వ్యతిరేకత ప్రారంభమైంది. సూపర్ సిక్స్‌లో భాగమైన తల్లికి వందనం, ఉచిత గ్యాస్ వంటి పథకాలు ఇప్పటికే అర్హులకు సైతం అందలేదనే విమర్శలు ఉన్నాయి. మహిళలకు ఉచిత బస్సు ఇప్పటికీ పట్టాలెక్కలేదు. మిగిలిన మూడు పథకాలు అమలు చేయలేని ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ చర్చను పక్కదారి పట్టించేందుకు పి 4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) అనే విధానాన్ని తెరపైకి తీసుకొచ్చిందనే చర్చప్రజలు, ఉద్యోగుల్లో జరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సాధికారత కల్పించి, వారి ఆర్థికస్థితి మెరుగు పరుస్తామని పి4ను తీసుకొచ్చింది. మార్గదర్శుల పేరుతో దాతలను వెతికి వారితో ఖర్చు పెట్టించి ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని ప్రభుత్వం చెబుతుండటం ప్రతిఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అధికారులపై ప్రభుత్వం ఒత్తిడితో పి4 కింద మార్గదర్శులుగా ప్రభుత్వం కొందరిని ఒప్పించింది. అందులో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు బంగారు 6776 బంగారు కుటుంబాలను గుర్తించగా, 3266 కుటుంబాలను 631 మార్గదర్శులు దత్తత తీసుకున్నట్లు నగర పాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. జనాభాలో 20 శాతం మందిని గుర్తించి ఎంపిక చేయాల్సి ఉండగా, సగం కుటుంబాలను మాత్రమే గుర్తించారు. ఇంకా మిగిలిన బంగారు కుటుంబాలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటి వరకు గుర్తించిన కుటుంబాలను దత్తత తీసుకోవాలంటే మరో 650వరకు మార్గదర్శకులను వెతికి పట్టుకోవాల్సి ఉంది. ఇది అధికారులకు తలనొప్పిగా మారింది. మరోవైపు నగర పాలక సంస్థ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఏడాదికి రూ.5 వేలు వసూలు చేసి స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ కి ఇచ్చారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. మార్గదర్శులుగా ఉపాధ్యాయులు కూడా ఉండాలని ప్రభుత్వ ఆదేశాలు పట్ల ఉపాధ్యాయులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల అమలు బాధ్యతపై ఒత్తిడి చేస్తే పని చేస్తాం కానీ, దాతలను వెతకాలంటే ఎక్కడి నుంచి తీసుకురావాలని అధికారులు పెదవి విరుస్తున్నారు. అయినా ప్రభుత్వం నుంచితీవ్ర ఒత్తిడి ఉండటంతో అధికారులు ఎవరి స్థాయిలో వారు దాతలను వెతికే పనిలో ఉన్నారు. అధికారుల సంప్రదింపులతో కొందరు దాతలు ఒప్పుకోకపోగా అధికారులపై చిర్రుబుర్రులాడుతున్నారు. విధి నిర్వహణలో టిడిపి నాయకుల ఒత్తిళ్లు ఒక ఎత్తయితే, విధి నిర్వహణను చూసుకోవాలో, లేక ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు తిరగాలో తెలియక అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరో వైపు సచివాలయ ఉద్యోగులు కూడా మార్గదర్శకులుగా ఉండాలని చెబుతున్నట్లు తెలుస్తుంది. ఈ నిర్ణయం పట్ల వారిలో కూడా వ్యతిరేకత ప్రారంభమైంది.



బంగారు కుటుంబాల గుర్తింపునకు సర్వే చేస్తున్న సిబ్బంది

జిల్లాలో యూరియా కొరత లేదు

- అవసరానికి మించి ఎరువులను వాడొద్దు
- నానో యూరియా ఎక్కువగా వినియోగించాలి : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో వర్షపాతం ఆశాజనకంగా ఉండటం వల్ల ఖరీఫ్ సీజన్ లో ముందుగానే వరినాట్లు పడుతున్నాయని, రైతులు అవసరానికి మించి ఎరువులను వాడవద్దనికలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ముందుగానే వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో, డిసెంబరు నుంచే అపరాలు సాగుచేసుకొనే అవకాశం కలుగుతుందని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో తమ ఛాంబర్ లో మంగళవారం సమావేశాన్ని నిర్వహించి, జిల్లాలోని పంటల పరిస్థితి, ఎరువుల లభ్యతపై సమీక్షించారు ఈ సందర్భంగా జిల్లాలో యూరియా కొరత వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వస్తున్న ఫిర్యాదులను డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది జులై నాటికి జిల్లాలో 19 వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయని, ఈ సంవత్సరం కూడా సకాలంలో వర్షాలు పడటంవల్ల, ప్రస్తుతం సుమారు 33 వేల హెక్టార్లలో వరినాట్లు వేశారని తెలిపారు. ఈ నెలాఖరుకు 40 వేల హెక్టార్లలో అన్ని పంటలకు నాట్లు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ 40 వేల హెక్టార్లకు సుమారు 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని, ఇప్పటివరకు 21 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు వినియోగించారని చెప్పారు. ఇంకా జిల్లాలో 6 వేల టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. ఆశించినంత పంట దిగుబడి రావాలంటే వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన విధంగా మాత్రమే ఎరువులను వాడాలని కలెక్టర్ కోరారు. నానో యూరియా (ద్రవపు యూరియా) వినియోగం వలన రైతుకు ఎక్కువ లాభం చేకూరుతుందని చెప్పారు. జిల్లాలో 6 వేల లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గత రెండు రోజులుగా ఎరువుల దుఖానాలపై విస్తతంగా దాడులు చేసి, అక్రమంగా నిల్వ ఉంచినవారిపై 6ఎ కేసులను నమోదు చేశామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాగే తనిఖీలను నిర్వహించి, అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, సిపిఒ పి.బాలాజీ, మార్క్‌ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎన్.వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్; డిసిసిబి ఛైర్మన్ నాగార్జున

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి
2న కలెక్టరేట్ వద్ద ధర్నా
ఫ్యాఫ్టో జిల్లా చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 2న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామనిఫ్యాప్టో జిల్లా చైర్మన్ పాలతేరు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల బదిలీ అయిన చాలామంది ఉపాధ్యాయులకు రెండు నెలలుగా బకాయి ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పొజిషన్ ఐడిలు తదితర సాంకేతిక నిబంధనలు పెట్టి రెండు నెలల జీతాలను ఇవ్వకపోవడం వల్ల చాలా మంది ఉపాధ్యాయులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేదన్నారు. వీటితో పాటుగా 18 డిమాండ్ల సాధన నిమిత్తం ప్రభుత్వానికి ఫ్యాప్టో నోటీసు ఇచ్చిందని, వాటిని పరిష్కరించకపోతే ఆగస్టు 2న జిల్లా స్థాయిలో 12న రా ష్ట్రస్థాయిలో ధర్నాలు చేస్తామని తెలిపారు.



నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

డిమాండ్ల సాధనకు ఉమ్మడి పోరాటం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితుల డిమాండ్ల సాధనకు ఉమ్మడిపోరాటం చేస్తామని సిపిఎం నాయకులు చల్లా జగన్ తెలిపారు. ప్రధాన ప్రతిపక్షం వైసిపికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కడబండి శ్రీనివాసరావు, శోభా హైమావతి జిందాల్ పోరాటానికి మద్దతిస్తూ రైతుల పక్షాన ఉంటామని చెప్పడం శుభ పరిణామమని అన్నారు. మంగళవారం బొడ్డవర వద్ద జిందాల్ నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీ కట్టనందున రైతులకు ఆ భూములు అప్పగించాలని, పబ్లిక్ హియరింగ్ లో ప్రకటించిన, మినిట్స్‌లో రాసిన విధంగా ఇంట్లో ఒక ఉద్యోగం, భూమి విలువకు సరిసమానమైన షేర్లు ఇస్తామన్న హామీల కోసం కూడా పోరాడుతామని తెలిపారు. అప్పుడే భూములు కోల్పోయిన పేద గిరిజన దళిత రైతులకు న్యాయం జరుగుతుందన్నారు 2006-2008లో మధ్యకాలంలో సిపిఎం, సిపిఐతో కలిసి జిందాల్‌ను వ్యతిరేకించిన టిడిపి ప్రజా ప్రతినిధులు కూడా జిందాల్ నిర్వాసితులకు అండగా నిలవాలని కోరారు.

పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులు

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్



సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం అందిన దరఖాస్తులను సింగల్ డెస్క్ పాలసీ కింద 21రోజుల్లో పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. మే నుండి జూలై వరకు 1652 దరఖాస్తులు అందగా 1634దరఖాస్తులకు అనుమతిచ్చామని, మిగిలిన వాటిలో 11 దరఖాస్తులు కాలుష్య నియంత్రణ మండలి వద్ద, మిగిలినవి ఫైర్, గ్రౌండ్ వాటర్, ఫ్యాక్టరీస్, లీగల్ మెట్రోలజి శాఖల వద్ద పెండింగ్ ఉన్నాయని తెలిపారు. వీటిని గడువు లోగా పరిష్కరించాలని, తిరస్కరిస్తే తగిన కారణాలతో తిరష్కరించాలని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల కమిటీ సమావేశం జెసి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన క్రింద మంజురైన యూనిట్లకు శిక్షణ కోసం రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు లేఖ రాయాలని పరిశ్రమల శాఖ జిఎంకు సూచించారు. జిల్లాలో విశ్వకర్మ కింద 66085 దరఖాస్తులు అందాయని, 3 దశల వెరిఫికేషన్ అనంతరం 6185 దరఖాస్తులను ఆమోదించామని తె లిపారు. వీరికి రుణాలను అందించేముందు శిక్షణ పూర్తి చెయ్యాలని తెలిపారు.

నాబార్డ్ ద్వారా వ్యవసాయ క్లినిక్ లు, వ్యవసాయ వ్యాపార కేంద్రాల పథకం కింద వ్యవసాయ విస్తరణ సేవలను అందించడంలో యువతకు మద్దతు ఇవ్వాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన అభ్యర్ధులు వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల కింద 20 లక్షల విలువైన వ్యక్తిగతమైన, కోటి రూపాయల పరిమితితో ఐదుగురు సభ్యుల గ్రూప్‌తో వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చునని తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్ధులకు బ్యాంకు రుణాలను అందించడం జరుగుతుందని, నాబార్డ్ ద్వారా సబ్సిడీ ని అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ కోసం http://WWW.acabcmis.gov.in/home.aspx ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కరుణాకర్ , నాబార్డ్ డిడిఎం నాగార్జున , ఎల్‌డిఎం రమణమూర్తి , విద్యుత్ శాఖ ఎస్ఇ లక్ష్మణ రావు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత , జిల్లా ఫైర్ ఆఫీసర్ రామ్‌కుమార్ , జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జున రావు, ఫ్యాక్టరీస్ , స్కిల్ డెవలప్మెంట్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సరోగసి క్లినిక్‌లను తనిఖీ చేసిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ జీవనరాణి మంగళవారం జిల్లాలోని ఎఆర్‌టి , సరోగసి క్లినిక్‌లను తనిఖీ చేశారు. వైజాగ్ ఐవిఎఫ్ సెంటర్ ను లండన్ ఐవిఎఫ్, క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్‌ను తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా రిపోర్టులు, రికార్డులు అన్నీ కూడా క్షుణ్ణంగా పరిశీలించి ఉన్న లోపాలను గుర్తించి వారికి సలహాలు సూచనలు అందించారు. పిసిపిఎన్‌డిటి, ఎంటిపి చట్టానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డెమో వి.చిన్నతల్లి, డిప్యూటీ డెమో రవి కుమార్,, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసఆర్ చాముండేశ్వరి , సిసి చంద్రశేఖర్ రాజు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అనిల్ ప్రేమ్ కుమార్ మానిటరింగ్ కన్సల్టెంట్ పవన్ ఆశిష్ పాల్గొన్నారు



రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంహెచ్‌ఒ

విద్యార్థినుల స్వీయ రక్షణకు శిక్షణ : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు స్వీయ రక్షణ కోసం మెళకువలు నేర్పించేందుకు ప్రత్యేకంగా ఒక మహిళా శిక్షకురాలిని నియమించినట్లు ఎస్‌పి వకుల్‌జిందల్ తెలిపారపు. మంగళవారం స్వీయ రక్షణ మెళుకవలు నేర్పించేందుకు శార్వాణి పోలీసు వెల్ఫేర్ ఆంగ్ల పాఠశాలలో నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులపై జరిగే దాడులు, ఈవ్ టీజింగ్, ఆకతాయిల వేధింపులు, లైంగిక దాడులను ప్రతిఘటించి, వారి దాడులను తిప్పి కొట్టేందుకు విద్యార్థినులకు తమను తాము రక్షించుకొనేందుకు కొన్ని స్వీయ రక్షణ టెక్నిక్స్‌ను నేర్పాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా రాధ అనే మహిళా శిక్షకురాలిని జిల్లా పోలీసుశాఖ నియమించిందన్నారు. ఈ శిక్షకురాలు పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ ను ముందుగా నేర్పించి, వారి సహకారంతో అన్ని పాఠశాలల్లోని విద్యార్థినులకు వాటిని నేర్పించే విధంగా చర్యలు చేపడు తున్నామన్నారు. ఈ తరహా శిక్షణతో విద్యార్థినుల్లో ఆత్మన్యూనత భావాన్ని పోగొట్టి, తమను తాము రక్షించేందుకు అవసరమైన ఆత్మ విశ్వాసం, ధైర్యం వస్తుందని తెలిపారు. అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు, పాఠశాల హెచ్ఎం సంధ్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి స్వీయ రక్షణలో శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు

హోంగార్డుల సంక్షేమానికి చర్యలు

విశాఖపట్నం రీజియన్ హోంగార్డు కమాండెంట్‌గా ఇటీవల బాధ్యతుల చేపట్టిన ఎ.జోషి తొలిసారిగా జిల్లాకు విచ్చేసి, మర్యాద పూర్వకంగా జిల్లా ఎస్‌పిని మంగళవారం కలిశారు. హోంగార్డుల సంక్షేమంకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్‌పితో చర్చించారు. ప్రభుత్వ పథకాల అమలు, బస్సు పాస్ ల జారీ, హెల్త్ పాలసీ వంటి అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి, హోంగార్డుల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. అనంతరం కమాండెంట్ ఎ.జోషి మాట్లాడుతూ హోంగార్డులతో సమావేశమై విధి నిర్వహణలో హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను హోంగార్డు కుటుంబాలకు వర్తింపజేయాలని, విధి నిర్వహణలో ఒక ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి ప్రయాణించేందుకు బస్ పాస్ వంటి సౌకర్యాలను కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఆర్.రమేష్ కుమార్, ఆర్ఎస్ఐ ముబారక్ అలీ, హోంగార్డు ఇన్‌ఛార్జి హెచ్‌సిలు రాజు, శ్రీనివాసరావు, హెరింగార్డు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జిని ఖండించండి
అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నెల్లూరు కార్పొరేషన్‌లో బలవంతంగా రుద్దుతుతున్న ఔట్ సోర్సింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ 18 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులపై లాఠీ ఛార్జీ చేయడాన్ని ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్రావు మాట్లాడుతూ సమస్యను పరిష్కరించాల్సిన పాలకవర్గం, ప్రభుత్వం పోలీస్ నిర్భంధాన్ని ప్రయోగించి, అక్రమ అరెస్టులు చేయటం దుర్మార్గమన్నారు. ఇంజినీరింగ్ కార్మికులను కాంట్రాక్టర్లకు బందీలను చేస్తూ కూటమి ప్రభుత్వం తెస్తున్న వర్క్‌ఔట్ సోర్సింగ్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి నెల్లూరులో జరుగుతున్న సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా కార్మికులపై పోలీసు నిర్భంధాన్ని ప్రయోగించి బలవంతంగా అమలుకు ప్రయత్నిస్తే రాష్ట్రమంతా పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, కార్మికులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తల్లిదండ్రుల సమావేశంలో డిఇఒ మాణిక్యం నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య సాధ్యమని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని డిఇఒ యు.మాణిక్యం నాయుడు అన్నారు. మంగళవారం పూల్‌బాగ్‌లోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో డిఇఒ సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విద్యకోసం కృషి చేస్తోందన్నారు. ఉచిత పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు తో పాటు తల్లికి వందనం ద్వారా ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. ఇన్ని సౌకర్యాలు ప్రభుత్వం ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ పిల్లలని ఎందుకు స్కూల్ కి పంపించడానికి అశ్రద్ధ వహిస్తున్నారని ప్రశ్నించారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమన్వయంతో మాత్రమే పిల్లలకు నాణ్యమైన విద్య అందించటానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం రోజూ స్కూల్ కి పంపించేటట్లు శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఉపాధ్యాయులకు రోజు పిల్లలు స్కూలుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క టీచరు ఐదుగురిని దత్తత తీసుకొని వారికి చదవడం, రాయడం నేర్పించడంతో పాటు స్కూల్‌కు రాకపోతే తల్లిదండ్రులకు ఫోన్ చేయడం విద్యార్థుల ఇంటికి వెళ్లి పిల్లలను స్కూలుకు వచ్చేటట్లు కృషి చేయాలని కోరారు. పాఠశాల హెచ్ఎం వి రఘురామ రాజు, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ బి.అనిత, ఉపాధ్యాయులు డి.ఈశ్వరరావు, వి.కృష్ణ, షేక్ అనీష్ నాగమణి ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిఇఒ మాణిక్యంనాయుడు

సరికొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి : మంత్రి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

వ్యాపార సంస్థలు కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇనస్టలేషన్ కార్యక్రమం మెసానిక్ టెంపుల్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిదిగా మంత్రితో పాటు విశిష్ట అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త కంకటాల మల్లిక్ హాజరయ్యారు. కమిటీ నూత అధ్యక్ష కారదర్శులుగా కాపుగంటి శ్రీనివాస్, బొడ్డు శ్రీనివాస్‌తోపాటు ట్రెజరర్ గా ప్రవీణ్ అంచాలియా, తొమ్మిది మంది ఉపాధ్యక్షులు, మరో తొమ్మిది మంది జాయింట్ సెక్రటరీలుగా పదవీ స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాపార సంస్థలు సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళున్నాయని, దానికి అనుగుణంగా ప్రభుత్వం ఎంఎస్ఎంఇ లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. జిల్లాలో మూడు ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రతి రంగానికి అభివృద్ధికి సహకరిస్తుందన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త కంకటాలమల్లిక్ మాట్లాడుతూ వ్యాపారసంస్థలో కూడా యువత సరికొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. నూతన అధ్యక్షులు కాపుగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యాపారులపై జిఎస్‌టి, ప్రాపర్టీ టాక్స్ భారం పడకుండా ప్రభుత్వం నుండి రక్షణ కల్పించాలని మంత్రిని కోరారు. వ్యాపార సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏవైనా ఛాంబర్ తరపున ముందుండి పరిష్కరించటానికి కొత్త కార్యవర్గం ఎల్లవేళలా ముందుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాస్, పిఎస్‌సి నాగేశ్వర రావు, ఉసిరికాయల చంద్రశేఖర్ ప్రసాద్, జి. శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

అంధుల పాఠశాలను సందర్శించిన డైరెక్టర్ రవిప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక పూల్‌బాగ్‌లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలను, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్దుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.రవిప్రకాష్ రెడ్డి మంగళవారం సందర్శించారు. పాఠశాల ఆవరణను, గదులను, ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలు, పథకాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. వీటిని వినియోగించుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనలో ఆ శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఆశయ్య, పాఠశాల ప్రధానాచార్యులు ఎం.మహేశ్వరరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రవిప్రకాష్ రెడ్డి

డిఎస్‌డిఒగా శ్రీధరరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం, మన్యం జిల్లాల క్రీడాభివృద్ధి అధికారిగా కె.శ్రీధరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు డిఎస్‌డిఒగా ఉన్న వెంకటేశ్వరావుకు విశాఖపట్నం బదిలీ అయ్యింది. శ్రీధరరావుకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ను కలసి పుష్పగుచ్చాలు ఇచ్చారు. ఆయనతో పాటు విశాఖకు బదిలీ అయిన వెంకటేశ్వరావు కూడా ఉన్నారు.

బాలుర వసతి గృహం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-నెల్లిమర్ల



గదులను పరిశీలిస్తున్న ఎ. కృష్ణప్రసాద్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల ట్రైబల్ వెల్ఫేర్ బాలుర ఆశ్రమ పాఠశాల వసతి గృహాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలకు వసతి కష్టాలు అనే ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్ గదులు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా ఉండేటట్టు చూసుకోవాలని హితవు పలికారు. డైనింగ్ హాలు వంట గదులను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న మెనూ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఆక్రమణలపై కొరడా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని రాజీవ్ స్టేడియం, సిటీ బస్టాండ్ ప్రాంతాల్లో రహదారులు, కాలువలను ఆక్రమించి చేపట్టి నిర్మాణాలను, బడ్డీలను అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ కాలువలను ఆక్రమించి పలకలు వేయడం నిషేధమని అన్నారు. ఎటువంటి ఆక్రమణలు చేపట్టరాదని ఆదేశించారు.

3న జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆగస్టు 9,10, 11 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరుగు రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక ఆగస్టు 3న ఉదయం 9 గంటల నుండి విజయనగరం విజ్జి స్టేడియంలో జరుగుతుందని అథ్లెటిక్ సభ్యులు లీలా తెలిపారు. 14, 16,18, 20 సంవత్సరాల బాల బాలికలకు రన్స్, త్రోస్, జంప్‌లో ఎంపికలు ఉంటాయని తెలిపారు. పాల్గొనదలచు బాల బాలికలు 14, 16 ఏళ్ల లోపు వారు పుట్టినతేదీ సర్టిఫికెట్, 16 ఏళ్ల పైబడిన వారు టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ తీసుకొని ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు 8 మంది

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తిరుపతిలో జరుగుతున్న బాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి 8మంది క్రీడాకారులు హాజరయ్యారు. కోచ్‌గా జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. బాలురు విభాగంలో భాగంలో యుగేష్, కె.ముఖేష్, వి.మనోహర్ , ఎ.విజయభారద్వాజ్, బాలికల విభాగంలో ఎం.ఉజ్వల, ఎ.శ్రీదేవి, జి.జాన్సీ, జి.చరిస్మా క్రీడాకారులు పాల్గొన్నారు. విజయనగరం బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్.సురేష్, అధ్యక్షులు కె ఎ నాయుడు అభినందనలు తెలిపారు.

పలువురికి పిహెచ్‌డి డాక్టరేట్లు

ప్రజాశక్తి-విజయనగరం

మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాలలో రసాయన శాస్త్ర విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న టి. సుధ, ఎం. సౌమ్య, ఎల్.దేవి, జి.చంద్ర శేఖరరావుకు గీతం విశ్వవిద్యాలయం పిహెచ్‌డి డాక్టరేట్ డిగ్రీలను ప్రదానం చేసింది. విశాఖ ఎంపి, గీతం విశ్వ విద్యాలయం చైర్మన్ ఎం.భరత్ 16వ స్నాతకోత్సవం సందర్భంగా వారికి పిహెచ్‌డి పట్టాలు అందజేశారు. వీరిని మహారాజ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం సాంబశివరావు ప్రత్యేకంగా అభినందించారు.

వెటర్నరీ కళాశాలలో సెమినార్

ప్రజాశక్తి- గరివిడి

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గరివిడి వెటర్నరీ కాలేజీలో 'మనం ఎవరు?..ఎక్కడ నుండి వచ్చాం' మనిషి పుట్టు పూర్వోత్తరాలకు మూలం, డిఎన్ఎఆర్ఎన్ఎ మొదలగు లగు శాస్త్రీయ ఆలోచనపై నెల్లూరు మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా సాహెబ్ విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్స్, జన విజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు ఎంవిఎన్ వెంకటరావు, మురళీధర్, చీకటి దివాకర్, నీలయ్య, సత్యశ్రీనివాసు, మురళి బాబు, రఘునాథరాజు, అప్పలస్వామి, గొర్లె రమణ, జె.మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి- తెర్లాం

పెరుమాలి సెక్టార్ మీటింగ్‌లో బాడంగి ఐసిడిఎస్ పిఒ వరహాలమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలకు నవచేతన ఆధార్ సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ1,2,3 కేంద్రాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు అందించవలసిన పౌష్టికాహారం, విధి విధానాలను, రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలు లోపు బాలికలకు తీసుకోవలసిన జాగ్రత్తలు అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు. సమాజంలో మత్తు పదార్థాలకు అలవాటై అనేక మంది బాలురు వ్యసనాలకు బానిసై చెడిపోతున్నారని అటువంటి వారిని గుర్తించి వారికి తగు కౌన్సిలింగ్ ఇచ్చి మంచి మార్గంలో నడిపించవలసిన బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలు తీసుకోవాలన్నారు. బాల్యవివాహాలపై అందరూ దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పెరుమాలి సెక్టార్ సూపర్‌వైజర్ అపర్ణ, సెక్టార్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో ప్రధాన రహదారి వల్లంపూడి పోలీస్ స్టేషన్ నుంచి పరదేశమ్మ గుడి వరకు రోడ్డునకు ఇరువైపులా ఉన్న కాలువలలో పేరుకుపోయిన పూడికను, చెత్తను కూలీలు, పారిశుధ్య కార్మికులతో తొలగించి చెత్తను ఎస్ డబ్ల్యూపిసి కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ పనులను ఇంఛార్జి ఎంపిడిఒ రవికుమార్ మంగళవారం పరిశీలించారు. వార్డు మెంబరు గ్రామ పెద్ద ఎం రమణ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ గొర్ల రాంబాబు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని అలుగోలు, సీతారామునిపేటలో బదిలీ అయిన సచివాలయం సిబ్బందికి మంగళవారం ఆయా సచివాలయం పరిధిలో వైస్ ఎంపిపి సారికి వైకుంఠం నాయుడు, సర్పంచ్ అలుగోలు బంగారమ్మ, కొత్తపేట సర్పంచ్ అట్టాడ శ్రీను, నాయకులు రాంబర్కి రామారావు, నడుపురు పరిశి నాయుడు, రేగాన శ్రీనివాసరావు సత్కరించారు. బదిలీలపై వెళ్లిన సచివాలయ సిబ్బంది, బదిలీపై వచ్చిన సచివాలయ సిబ్బంది అందరికి వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు డి. శ్రీనివాసరావు, కె.బంగార్రాజు, కె.రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బైకు ఢీకొని వృద్ధుడు మృతి

మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రంగరాయపురం, జమాదావిపేట సమీపంలోని విశాఖ అరకు రోడ్డు మధ్యలో బ్రిడ్జి వద్ద మంగళవారం సాయంత్రం కొత్తవలస నుంచి వస్తున్న ఆటో ఎల్‌కోట నుంచి వెళుతున్న బైక్ బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కితన్నపేట గ్రామానికి చెందిన ఎడ్ల సింహాచలం నాయుడు (62) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. సింహాచలం నాయుడు మృతదేహాన్ని ఎస్.కోట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు సిహెచ్ నవీన్ పడాల్ తెలిపారు.

క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్లానింగ్ సెక్రటరీలందరూ ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకూ సచివాల పరిధిలో జాబ్ చార్ట్ ప్రకారం ఫీల్డ్ విజిట్ చేయాలని కమిషనర్ రామలక్ష్మి ఆదేశించారు. బొబ్బిలి పురపాలక సంఘంలో మంగళవారం ఆమె టౌన్ ప్లానింగ్ డిపార్టుమెంటు, వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ పరిధిలో రోడ్లు, డ్రైన్లు ఎంకరోజ్మెంట్ చేసిన వారికి నోటీసులు జారీ చేసి వాటిని తొలగించాలన్నారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న అనాథరైజ్డ్ నిర్మాణాలు నిలుపుదల చేసి వాటికి బిల్డింగ్ ప్లాన్స్ పెట్టుకునే విధంగా చూడాలన్నారు. ఎక్కడైనా రోడ్లపై డెబ్రీస్, బిల్డింగ్ మెటీరియల్ ఉన్న ఎడల వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. రోడ్ల మధ్య స్తంభాలకు, రోడ్లకు ఇరువైపులా ఉన్న హోర్డింగ్స్‌కు పర్మిషన్ లేనట్లయితే వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు.

'చంద్రబాబువి మోస పూరిత హామీలు'

ప్రజాశక్తి- వేపాడ

చంద్రబాబువి మోస పూరిత హామీలని ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు అన్నారు. మండలంలోని బల్లంకి గ్రామంలో మంగళవారం వైసిపి మండల అధ్యక్షులు మమ్ములూరు జగన్నాథం ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, మండల జెసిఎస్ కన్వీనర్ భోజంకి శ్రీను, నాయకులు ఆకుల సత్తిబాబు, కేదారి శ్రీను, బల్లంకి సర్పంచ్ కనకరాజు వరలక్ష్మి, బొడ్డు శ్రీనివాస్, బోయిదా అప్పారావు, ఒబ్బిన జగ్గారావు, లంక రాము, కనితి ఆశీర్వాదం, కనితి క్రాంతి, డేగల శ్రీను, గోకడ మహేష్, బొడ్డు నాయుడు, పల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని పెద్దఖండేపల్లిలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి ఇంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు వివరించారు. చంద్రబాబు ఎన్నికలు ముందు ఇచ్చిన మేనిఫెస్టో గుర్తుచేసారు. మానిఫెస్టోలో ఇచ్చిన పథకాలు ప్రజలకి ఈ ఏడాది రాకపోవటం వల్లన ఎంత నష్టపోయారు అని వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, నాయకులు వాకాడ రాంబాబు, పోతనపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, సాంబరాజు, వెంకటరమణ, మేరపురెడ్డి చినబాబు, యర్రపాటి సూర్యనారాయణ, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌కోట: మహిళతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు కడుబండి, హైమావతి

లక్కవరపుకోట: సూపర్ సిక్స్ అమల్లో చంద్రబాబు విఫలమయ్యారని ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అన్నారు. లక్కవరపుకోటలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బాకం అప్పారావు, సర్పంచ్ రావాడ నేలకంఠం, తూర్పాటి అప్పలరాజు, ఎంపిటిసి బొడ్డు గణపతి, కె.మహేష్, భూమి రెడ్డి రామారావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా 37, 38, 42, 43 డివిజనల్‌లో వైసిపి నాయకులు మంగళవారం వార్డు పర్యటన చేశారు. ముందుగా 37వ డివిజన్ కార్పొరేటర్ కడియాల రామకృష్ణ మాట్లాడుతూ వైసిపి పాలనలో కోలగట్ల వీరభద్ర స్వామి బిసి కాలనీలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం 38, 42, 43 డివిజన్‌లో జరిగిన సమావేశాల్లో స్థానిక కార్పొరేటర్లు ఎన్నికల సమయంలో చంద్రబాబు చేసిన మోసపూరిత వాగ్దానాలను, ఏడాది గడిచినా అందని సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను, వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, నగర మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, నగర ఉపాధ్యక్షులు రెడ్డి గురుమూర్తి, కార్పొరేటర్లు తొగరోతు సంధ్యారాణి, పిన్నింటి కళావతి, దాసరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అంటూ ప్రజలను మభ్య పెట్టి పరిపాలన చేస్తున్నాయని ఎంపిపి చల్ల చల్లంనాయుడు, మండల వైసిపి అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు అన్నారు. కొండకిండాం, కిండాం అగ్రహారం, రాచకిండాం, చామలవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొట్లాం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు మహంతి రమణ, నాయకులు సాలాపు పెంటంనాయుడు, మూగల చలంనాయుడు స్థానిక సర్పంచులు పెద మజ్జి ఆదిలక్ష్మి, బుంగ దేముడు, చొక్కాకు ఈశ్వరమ్మ, తాడ్డి రవణమ్మ, బొండపల్లి ఈశ్వరరావు, ఎంపిటిసిలు తాళ్లపూడి అప్పలనాయుడు, బండారు శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ శ్రీను, సీనియర్ నాయకులు చొక్కాకు నారాయణరావు, పెదమజ్జి గోపి, తాడ్డి ప్రకాష్ రావు, మండల రాము నాయుడు, వేమలి వెంకటరావు, తాళ్ళపూడి అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: చంద్రబాబు మోసాలు గురించి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక మున్సిపాల్టీ పరిధిలో గల 8వ వార్డులో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పట్టణ వైసిపి నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడగంజి రమేష్ నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణరావు, వార్డు ఇంచార్జ్ ముగిది మురళీకృష్ణ, ఇంటి గోపాలరావు, తూముల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సభ్యులు ధ్వజం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ సమస్యలపై సభ్యుల ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఎపి మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు ముఖ్య అతిథులుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, ఆయా వార్డుల్లో తాగునీటి సరఫరా, లోవోల్టేజ్ సమస్యలపై కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. ముఖ్యంగా రెండు నెలలు నాలుగు వార్డుల్లో మంచినీటి సమస్య ఉన్నప్పుడు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేశామని అధికార్లు చెబుతుండగా ఎన్ని ట్యాంకులు ద్వార సరఫరా చేశారో లెక్కతేల్చి చెప్పాలని 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు డిమాండ్ చేశారు. వీధి దీపాలు ఏర్పాటు నిర్వహణకు 4లక్షల 98వేల రూపాయలు ఖర్చు ప్రతిపాదన పెడుతున్నట్లు అధికార్లు చెబుతుండగా 16వ వార్డు జనసేన నాయకులు పాండ్రంకి సత్యనారాయణ అసలు వీధి లైట్లు వెలగడం లేదని లోవోల్టేజ్ తో ఇబ్బందులు పడుతున్నా అధికార్లు పట్టించుకోలేదు సరికదా తిరిగి కొత్త ప్రతిపాదనలు ఎలా చేస్తారని ధ్వజమెత్తారు. పారిశుధ్యం అంతంత మాత్రంగా ఉందని వీధి కాలువలు, రోడ్లు మురుగునీటితో నిండిపోయి ఉన్నాయని, మంచినీరు కూడా సక్రమంగా అందడం లేదని సభ్యుల ధ్వజ మెత్తారు. దీనిపై ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ నగర పంచాయతీ సమస్యలు పరిష్కారానికి కృషి చేసి సభ్యుల తీసుకువచ్చిన సమస్యలపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో చైర్ పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ టి.జయరాం, వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ సత్యనారాయణ

గ్రామాల సందర్శన

ప్రజాశక్తి - సంతకవిటి



సూచనలు చేస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ

మండలంలోని బిల్లాని, తలతంపర గ్రామాలను డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.శ్రావణ్ కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను సేకరించిన తదుపరి ప్రాసెసింగ్ కోసం చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. గ్రామాలలోని ప్రతి రోజు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. పలు వీధుల్లో తిరిగి కాలువల్లో చెత్త వెయ్యకూడదని ప్రజలకు సూచించారు. ఎవరైనా కాలువల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాధుల సీజన్ వచ్చిందని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సచివాలయ సిబ్బందికి తెలిపారు. అనంతరం ఐవిఆర్ఎస్ కాల్స్, గార్బేజ్ కలెక్షన్ గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చిన్నారావు, కేశవరావు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఘనంగా ఎమ్‌పి భరత్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో మంగళవారం విశాఖ ఎమ్‌పి ఎం.శ్రీభరత్ పుట్టిన రోజు వేడుకలను ఘణంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో ముందు కేక్ కట్ చేసి నాయకులు, క్యాకర్తలకు పంచి పెట్టారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, రాష్ట్ర ఎస్‌టి సెల్ సభ్యులు, మాజీ ఎంపిపి దాసరి లక్ష్మి, సీనియర్ నాయకులు వై అప్పల నాయుడు, జి నాగరాజు, ఐటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్, జె.ఈశ్వరరావు, జగ్గుబాబు, సేనాపతి అప్పారావు, బుద్ధ కృష్ణ, సిహెచ్ దేవుడు, వావిలపాడు దేవుడినాయుడు, ఎన్ గాలినాయుడు, ఎన్ సత్య వెంకట్ నాయుడు, పాల్గొన్నారు.

లక్కవరపుకోట: విశాఖ ఎంపి శ్రీభరత్ నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం ఎంపి జన్మదిన వేడుకలను పార్టీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబిఎ రాంప్రసాద్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ, కొత్తవలస ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లనాయుడు, మాజీ జెడ్‌పిటిసి ఈశ్వరరావు, మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి పాల్గొన్నారు.

కెజిబివిల బలోపేతానికి చర్యలు

ఎస్ఎస్ఎ ఎపిసి రామారావు

ప్రజాశక్తి - బొబ్బిలి

జిల్లాలో కెజిబివి వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎస్ఎస్ఎ ఎపిసి రామారావు అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కెజిబివి పాఠశాలలను బలోపేతం చేసేందుకే ఇంటర్మీడియట్ ప్రారంభించినట్లు చెప్పారు. కెజిబివి పాఠశాలలకు సంబంధించి జిల్లాలో ఇంటర్ డార్మెంటరీ భవనాలకు రూ.1.60కోట్లు మంజూరైనట్లు చెప్పారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అక్కడే ఇంటర్ పూర్తి చేసేలా ఇంటర్మీడియట్‌లో ఐదు గ్రూపులు ఉన్నాయన్నారు. ఒకొక్క కళాశాలలో ఒకొక్క గ్రూపు ఉందని చెప్పారు. ఆరో తరగతి 100 శాతం, ఇంటర్మీడియట్ 90శాతం సీట్లు అడ్మిషన్లు భర్తీ అయ్యాయని చెప్పారు. ఒకొక్క పాఠశాలలో ఐదు నుంచి ఆరు రూములు ఉన్నాయన్నారు. నాడు-నేడు పనులు సిమెంట్ కొరత వల్ల ఆగాయని, పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శ్రీధర్మేంద్ర ప్రధాన్ పథకం కింద గురుకుల పాఠశాల ఎంపిక

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శ్రీధర్మేంద్ర ప్రధాన్ పథకం కింద బొబ్బిలి గురుకుల పాఠశాల ఎంపికైంది. ఈ పథకం కింద ఏర్పాటు చేసిన కెమిస్ట్రీ ల్యాబ్, క్రీడా మైదానం, కిచెన్ గార్డెన్‌ను మంగళవారం ఎస్ఎస్ఎ ఎపిసి రామారావు పరిశీలించారు. గురుకుల పాఠశాలను అభివృద్ధి చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు చెప్పారు. పాఠశాలలో సమస్యలను ప్రిన్సిపాల్ రఘునాథ్ వివరించారు. పిఎం కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభించినట్లు చెప్పారు. ఎస్-ఎ ఇంజినీరింగ్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. నిర్మాణాలు ఆఖరి దశలో ఉన్నాయని ప్రభుత్వ పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత సాధనకు పని చేస్తున్నామని చెప్పారు. అన్ని పాఠశాలల్లో ఆటలను అభివృద్ధి చేస్తామన్నారు. విజయ పథం కింద డైలీ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. భోజనాలలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. భోజనాలలో నాణ్యత లోపించిన, మెనూ అమలు చేయకపోయినా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎపిసి చెప్పారు. మీ గమ్యం మీ చేతుల్లోనే పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు సిహెచ్ లక్ష్మణరావు, వాసు పాల్గొన్నారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న అధికారులు



రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

ఇవిఎం గోదాముల తనిఖీ


ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఈవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మంగళవారం తనిఖీ చేశారు. గోదాము షట్టర్లకు, లోపలి గదులకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించారు. బందోబస్తుపై సమీక్షించారు. సిసి కెమేరాల ద్వారా చుట్టు పక్కల, గోదాముల్లోని పరిస్థితులను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఓ డి.కీర్తి, నెల్లిమర్ల తాహశీల్దార్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటిండెంట్ భాస్కరరావు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఒ ప్లాంట్‌ను పునఃప్రారంభించండి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలంలోని చోడమ్మ అగ్రహారంలో గత కొన్ని సంవత్సరాలుగా మూతపడి ఉన్న ఆర్వో (రివర్స్ ఆస్మోసిస్) ప్లాంట్‌ను మళ్లీ తెరిపించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో నీటి కాలుష్యం తీవ్రమవుతున్న నేపథ్యంలో, శుద్ధ తాగునీరు అవసరం చాలా ఉందని చెబుతున్నారు. గ్రామస్తులు పిల్లా శ్రీరాములు నేతృత్వంలో స్థానికులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాలు సమర్పించారు. గతంలో మైలాన్ పరిశ్రమ సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంట్ పరికరాలు గ్రామానికి అందజేసిందని, అయితే ఒక్క సంవత్సరానికే మిషన్‌లో లోపం రావడంతో ప్లాంట్ మూతబడిందని చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామస్తులు రక్షిత మంచి నీట కోసం చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి ఎదుర్కొంటున్నారని, కలుషిత నీరు తాగడం వల్ల గ్రామంలో వందలాది మంది జ్వరాల బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ నిధుల్లో లక్షలాది రూపాయలు ఉండగానే తాగునీరు లభించకపోవడం దురదృష్టకరమని వారు విమర్శించారు. పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదని వారు చెప్పారు. ఈ నేపథ్యంలో, గ్రామానికి ఉపయోగకరంగా ఉన్న ఆర్వో ప్లాంట్‌కు తక్షణమే మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు..



మూతపడిన ఆర్‌ఒ ప్లాంట్

గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ రామమూర్తికి అభినందనలు

ప్రజాశక్తి - బొబ్బిలి

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా ఎన్నికైన రౌతు రామమూర్తికి అభినందనలు వెల్లువెత్తాయి. రామమూర్తిని మంగళవారం హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భాషా, రఫీ, బాబ్జి, ఖాన్ కలిసి పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందించారు. గ్రంథాలయాల అభివృద్ధికి పని చేస్తానని రామమూర్తి చెప్పారు.



రామమూర్తిని సత్కరిస్తున్న ముస్లీం సోదరులు

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- మెంటాడ

నారుమడుల సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కెల్ల లక్ష్మణ్ అన్నారు. మండలంలోని జయతి గ్రామంలో మంగళవారం ఎఒ కె.గోకుల్ కృష్ణ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త లక్ష్మణ్ మాట్లాడుతూ నాట్లు వేసే వారం రోజులు ముందుగా పలు రకాల సస్యరక్షణ పద్ధతులు రైతులు పాటించాలని ఆయన సూచించారు. క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులు తగ్గించి వాడినట్లయితే భూసారం పెరుగుతోందన్నారు. దీంతోపాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, పలు రకాల కషాయాలను వాడినట్లయితే ఆరోగ్యకరమైన తిండిగింజలు ఉత్పన్నం ద్వారా అధిక లాభాలు పొందవచ్చు నని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె.సాయికృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.కృష్ణవేణి, రైతులు కలిశెట్టి గౌరీ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని నల్లబిల్లి, వావిలాపాడు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎద వరి సాగులో కలుపు యాజమాన్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరి పంటలో ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు ఎఒ వివరించారు. వరి చేనులో నానో యూరియా, నానో డిఎపి వాడకం మీద అవగాహన కల్పించారు. బీమా రూ.200 కడితే ఎకరాకు రూ.4వేలు ఇన్సూరెన్స్ కవర్ అవుతుందని దీని వల్ల వరి పంటకు కరువు, తుఫాను లాంటి ప్రకృతి వైపరీత్యాలు వస్తే ఆ బీమా సొమ్ము రైతుకు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ విఎఎ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: రైతులు పంటల బీమా నమోదు చేసుకోవాలని ఎఒ పి.శ్రీలక్ష్మీ సూచించారు. మంగళవారం అలుగోలులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మొక్క జొన్న పంటను పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటల బీమా నమోదు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా మొక్క జొన్నకు ఈ నెల 31, వరిపంటకు వచ్చే నెల 15లోగారైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకంలో గ్రీవెన్స్ ఇవ్వవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సారికి వైకుంఠం నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త లక్ష్మణ్

బొండపల్లి: మండలంలోని కొండకిండాం, రాచకిండాం గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి మల్లిఖార్జునరావు, రైతులకు వెదజల్లే వరి పెంపకంలో చేపట్టవలసిన వివిధ యాజమాన్యం పద్ధతులపై అవగాహన కల్పించారు. కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం వల్ల కలుగు ప్రయోజనాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సత్యవతి, సరోజినీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ లేక అవస్థలు

ప్రజాశక్తి - మెంటాడ

ఇటీవల సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా ఇతర సచివాలయాలలో విధులు నిర్వహించేందుకు ఇక్కడ సచివాలయ సిబ్బంది వెళ్లిపోయారు. మెంటాడలో డిజిటల్ అసిస్టెంట్ చంద్రశేఖర్ బదిలీపై కైలాం సచివాలయానికి వెళ్లారు. దీంతో మెంటాడ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ పోస్ట్ ఖాళీగా ఉంది. ఇక్కడకు సాలూరు మండలానికి సంబంధించి బదిలీపై రావలసి ఉంది. ఇప్పటివరకు డిజిటల్ అసిస్టెంట్ జాయిన్ కాకపోవడంతో మండల కేంద్ర ప్రజలు నానా అవస్థలు, తిప్పలు పడుతున్నారు. కొత్త రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, చంద్రన్న పెళ్లి కానుక, మ్యూటేషన్లు, వివిధ రకాల పథకాల కోసం సచివాలయంలో ఆన్ లైన్ చేసుకోవాల్సి ఉంది. ఇటువంటి పనులు చేసుకోవాలంటే డిజిటల్ అసిస్టెంట్ లేక గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధించిన ఉన్నత అధికారులు చొరవ తీసుకుని డిజిటల్ అసిస్టెంట్ నియామకం చేపట్టాలని మెంటాడ ప్రజలు కోరుతున్నారు.